ప్రమాదకరంగా డ్రైయినేజీలు !

- పై కప్పు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం
- ఇబ్బందులు పడుతున్న చిట్యాల పట్టణ వాసులు


పట్టణంలోని పదో వార్డులో పైకప్పు లేని డ్రైయినేజీ


చిట్యాల పట్టణంలోని ఎనిమిదో వార్డులో..

చిట్యాల : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నిర్మించిన ఓపెన్ డ్రైయినేజీలు ప్రమాదకరంగా మారాయి. వరద నీరు పోయేందుకు కొన్ని కాలువలను వెడల్పుగా పైకప్పు లేకుండానే నిర్మించారు. దీంతో పాదచారులతోపాటు వాహనదారులు ఓపెన్ డ్రైయినేజీల పక్కన నుంచి ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణించాల్సి వస్తోంది.

పదిహేనేళ్ల క్రితం నిర్మాణం

పట్టణంలోని పదో వార్డు(ముత్యాలమ్మగూడెం)లో పదిహేనేళ్ల క్రితం సుమారు కిమీ దూరం మేర ఓపెన్ డ్రైయినేజీ నిర్మించారు. వార్డుల్లోని మురుగు నీటితోపాటు వర్షపు నీరు పోయేందుకు డ్రైయినేజీలను వెడల్పుగా లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించారు. కొత్త శివనేనిగూడెం రోడ్డు నుంచి పాత శివనేనిగూడెం రోడ్డు వరకు ఓపెన్ డ్రైయినేజీ నిర్మాణం చేపట్టారు. ఆ వార్డులో ఇళ్ల మధ్య సీసీ రోడ్డు పక్కన ఈ డ్రైయినేజీని నిర్మించారు. పైకప్పు లేకుండా వెడల్పు డ్రైయినేజీలు నిర్మించడంతో ఆ దారి గుండా వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఏడో వార్డులో మసీదు వద్ద నుంచి భాగ్యనగర్ వెంచర్‌లో ఇళ్లలోని మురికి నీటితోపాటు వరద నీరు పోయేందుకు నిర్మించిన ఓపెన్ డ్రైయినేజీ కూడా ప్రమాదకరంగా ఉంది. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ప్రహరీ ఆనుకుని భువనగిరి రోడ్డు నుంచి హైవే రోడ్డు వరకు ఇటీవల కప్పు లేకుండా డ్రైయినేజీ నిర్మించారు. దీంతో ఈ రోడ్డుపై రెండు ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఓపెన్ డ్రైయినేజీలకు పై కప్పు నిర్మించాలని ఆయా వార్డు ప్రజలు మున్సిపల్ అధికారులను, పాలకవర్గ సభ్యులను కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డులో..

పట్టణంలోని ఎనిమిదో వార్డులో జాతీయ రహదారికి ఆనుకుని సిక్కు కాలనీ ఇళ్ల పక్కన సర్వీస్ రోడ్డులో గతంలో రహదారి విస్తరణలో తొలగించిన మురికి కాల్వను తిరిగి నిర్మించలేదు. దీంతో మురుగు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో పక్కన నివసించే గృహస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మురికి కాల్వ నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆ కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు.

పైకప్పు నిర్మించాలి



మా వార్డులో ఇళ్లలోని మురుగుతోపాటు వరద నీరు పోయేందుకు వెడల్పాటి ఓపెన్ డ్రైయినేజీ నిర్మించారు. సీసీ రోడ్డు పక్కన పైకప్పు లేకుండా డ్రైయినేజీ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. మున్సిపల్ అధికారులు నిధులు మంజూరు చేసి ఓపెన్ డ్రైయినేజీపై కప్పు నిర్మాణం చేపట్టాలి.
– పోలగోని వెంకటేష్‌గౌడ్, ముత్యాలమ్మగూడెం

ప్రస్తుతం నిధులు లేవు



చిట్యాల పట్టణంలోని ఏడు, పదో వార్డులో ఓపెన్ డ్రైయినేజీలు ఉన్నాయి. ఈ డ్రైయినేజీలు చిట్యాల గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు నిర్మాణం చేశారు. ప్రస్తుతం ఓపెన్ డ్రైయినేజీలపై కప్పులు వేసేందుకు ఎలాంటి నిధులు అందుబాటులో లేవు. త్వరలో ఆ వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.
– మందడి రామదుర్గారెడ్డి, కమిషనర్, చిట్యాల మున్సిపాలిటీ

పట్టణ అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్


నిరసన తెలుపుతున్న కౌన్సిలర్ దైద స్వప్న

నకిరేకల్ : మున్సిపాలిటీలో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు అందరు సహకరించాలని నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సహకారంతో కోట్ల రూపాయల విలువ గల వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అనంతరం పట్టణంలో చేపట్టబోయే అభివృద్ధి పనులపై పలు తీర్మానాలు చేశారు. వివిధ తీర్మానాలపై 18వ వార్డు కౌన్సిలర్ దైద స్వప్న అభ్యంతర తెలిపి చాంబర్‌లో కింద కూర్చొని నిరసన తెలిపారు. ఏక పక్ష తీర్మానాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వివిధ వార్డుల కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

వరినాట్లు వేసిన ఎమ్మెల్యే చిరుమర్తి


నీర్నెములలో మహిళలతో కలిసి వరినాటు వేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట : నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం మహిళలతో కలిసి వ్యవసాయ పనులు చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల, లక్ష్మాపురం, కొత్తగూడెం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వెళ్తుండగా నీర్నెముల గ్రామశివారులో బత్తుల లక్ష్మమ్మకు చెందిన పొలంలో మహిళలు వరినారు తీస్తుండడం గమనించి తన కాన్వాయ్‌ను ఆపి వారి వద్దకు వెళ్లి ముచ్చటించారు. అనంతరం వారితో కలిసి కొద్దిసేపు నారు తీశారు. నారు కట్టలు(లుంగలను) పట్టుకెళ్లి పొలంలో పంచారు. మహిళలతో కలిసి వరినాట్లు వేశారు.

క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక

శాలిగౌరారం : మండలంలోని మనిమద్దె గ్రామానికి చెందిన చేయూతనిద్దాం ఫౌండేషన్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కారుపాటి అంబేద్కర్, ఉపాధ్యక్షుడిగా కత్తుల ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా ఓగోటి లవకుమార్, సంయుక్త కార్యదర్శిగా శివరాత్రి వెంకటేశ్, కోశాధికారిగా సిరుపంగి సాయికుమార్, కార్యనిర్వాహక సభ్యులుగా ఊడుగు కిరణ్, కృష్ణసాయిలు ఎన్నికయ్యారు.

నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లలో చోరీ

కనగల్ : మండల పరిధిలోని చర్లగౌరారం గ్రామంలో రూ.3.52 లక్షల వ్యయంతో 70 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మిస్తున్నారు. వారం రోజుల క్రితం బండలను పాలిస్‌పట్టే మిషన్, ఐరన్ ఎత్తుకెళ్లగా శుక్రవారం రాత్రి మిల్లర్ ఇంజన్‌ను చోరీ చేసినట్లు కాంట్రాక్టర్ భారత వెంకటేశం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. సీకు, సిమెంట్, ఇటుక, కంకర, ఇసుకను సమీపాన గుడిసెలు వేసుకుని తాత్కాలికంగా ఉన్న వారే ఈ పనికి పాల్పడుతున్నట్లు పోలీసులకు కాంట్రాక్టర్ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఏకపక్ష తీర్మానాలు సరికావు

నకిరేకల్ : నకిరేకల్ మున్సిపాలిటీలో ఏకపక్ష తీర్మానాలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం కోసం నిధులు ఇష్టారీతిగా కేటాయించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ దైద స్వప్న, నాయకులు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు బంధుకు దరఖాస్తు చేసుకోవాలి

మఠ్రిగూడ : జూన్ 18 వరకు కొత్తగా భూమి పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులందరూ రైతు బంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ ఆవుల స్పందన పేర్కొన్నారు. శుక్రవారం స్థానికంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ ఏడాది 1015 మంది రైతులు ధరణి ద్వారా పట్టా చేసుకున్నారని వారిలో 805 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా మరో 210 మంది రైతులు దరఖాస్తు చేసుకోలేదని అన్నారు. రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో రైతులు రైతు వేదికలో ఏఈఓలను సంప్రదించాలని సూచించారు. ఆమె వెంట ఏఈఓలు రాధిక, సంతోషలు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కనగల్ : మండల పరిధిలోని బోయినపల్లి గ్రామ వాగు నుంచి బుడుమర్లపల్లి గ్రామానికి చెందిన కందుల నరేష్ అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండడంతో పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నర్రా అంతిరెడ్డి శుక్రవారం తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

గ్రూప్-4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కట్టంగూర్ : మండల కేంద్రంలో శనివారం జరిగే గ్రూప్-4 పరీక్షకు అన్ని ఏర్పాటు పూర్తి చేసినట్లు తహసీల్దార్ (రూట్ అధికారి) పి. శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాందీపని అప్పర్ ప్రైమరీ స్కూల్(ఇంగ్లిష్ మీడియం) పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సాందీపని పాఠశాలలో 264 మంది, ప్రభుత్వ హైస్కూల్‌లో 216 మంది పరీక్ష రాసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల వద్దకు గంట ముందే చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లైజన్ అధికారులు చలపతి, సుకన్య, సీఎస్‌లు జ్యోతి, రాములు ఉన్నారు.

మునుగోడు : గ్రూప్-4 పరీక్షకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. మునుగోడులోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం నిర్వహించనున్న గ్రూప్-4 పరీక్షను మొత్తం 1774 మంది రాయనున్నారు. అందుకు మండలంలోని వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను 74 మందిని ఇన్విజిలేటర్లుగా నియమించారు. వారితో పాటు మరో 12 మందిని కేంద్రానికి ఇద్దరు చొప్పున రిజర్వులో ఉంచారు. పరీక్ష కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను స్థానిక తహసీల్దార్ నరేష్ పరిశీలించారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

కేతేపల్లి : మండలంలోని భీమారం గ్రామంలో భార్యను వేధిస్తూ హత్యాయత్నం చేసిన ఆమె భర్త ప్రభుత్వ ఉపాధ్యాయుడు కోట కోటయ్యతోపాటు ఆయనకు సహకరించిన వారిపై పోలీసులు కఠినంగా చర్యలు తీసువాలని బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు మాందాసు విజయరాణి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కేసును తప్పుదోవ పట్టించే కుట్రలో భాగంగానే విచారణ పేరుతో తమను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొట్టారంటూ నిందితులు డ్రామాకు తెరలేపారని ఆరోపించారు. తక్షణమే నిందితులను అరెస్టు చేసి మహిళకు న్యాయం చేయాలని కోరారు.

సభ్యత్వ నమోదు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ గెజిటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ (711) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నల్లగొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో చేపట్టారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొండల్, జిల్లా శ్రీనివాస్, పి ఆంజనేయులు, రామలింగం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం


చెక్కు అందజేస్తున్న పల్లె రవికుమార్

చండూరు(గట్టుప్పల్) : గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కల్లు గీత కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. గట్టుప్పల్ మండలం వెల్మకన్నె గ్రామానికి చెందిన దోటి రవీందర్ ఇటీవల తాటి చెట్టు పైనుంచి పడి మరణించారు. విషయం తెలుసుకున్న రవికుమార్ శుక్రవారం బాధితుడి ఇంటికి వెళ్లి తక్షణ ఆర్థిక సహాయంగా కల్లుగీత కార్పొరేషన్ నుంచి మంజూరైన రూ.25వేల విలువ గల చెక్కు అందజేశారు. అనంతరం తాటి చెట్టు పైనుంచి పడిన మరో గీతకార్మికుడు పెటుగాళ్ల భీమయ్యగౌడ్‌ను పరామర్శించి త్వరలోనే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గీత కార్మిక వృత్తిని ప్రమాదరహిత వృత్తిగా తీర్చిదిద్దే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఇడెం కై లాష్ నేత, ఎంపీటీసీ చాపల మారయ్య ముదిరాజ్, సర్పంచ్ చెల్లమల్ల వెంకట్‌రెడ్డి, గ్రామ సొసైటీ అధ్యక్షుడు పర్సబోయిన యాదయ్య, వనం. శ్రీను ముదిరాజ్, భీమనపల్లి సత్తయ్య తదితరులు ఉన్నారు.

3న కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ టౌన్ : పేదలకు 120 గజాల ఇంటి స్థలాన్ని ఇచ్చి నిర్మాణం కోసం రూ.3లక్షల ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 3న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆవాజ్ కమిటీ జిల్లా కార్యదర్శి సయ్యద్‌హాషం సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక దొడ్డి కొమరయ్య భవన్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బాణాల పరిపూర్ణాచారి, ఎండీ సలీం, ఊట్కూరి నారాయణరెడ్డి, దండెంపల్లి సరోజ, భూతం అరుణ, గాదె నర్సింహ, నరేష్, నగేష్ సత్యనారాయణ, సైదాచారి, శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.

చిట్యాల : పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలతోపాటు పలు సమస్యల పరిష్కారానికి ఈ నెల 3వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్ కోరారు. వెలిమినేడు గ్రామంలో శుక్రవారం జరిగిన డీవైఎఫ్ఐ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు పంది నరేష్, వడ్డెగాని మహేష్, గడ్డం నర్సిరెడ్డి, బొడ్డుపల్లి శ్రీను, విఘ్నేష్ పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : ఇళ్ల స్థలాల సాధన కోసం ఈ నెల 3వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కర్నాటి మల్లేశం కోరారు. గట్టుప్పల్‌లో శుక్రవారం జరిగిన సీపీఎం మండలం కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు చాపల మారయ్య, బొట్ట శివకుమార్, కర్నాటి సుధాకర్, శ్రీనివాస్, నగేష్, శేఖర్, రబ్బాని, అచ్చిన శ్రీనివాస్, ఖమ్మం రాములు, దుబ్బాక రాములు తదితరులు పాల్గొన్నారు.

'ఎన్జీ' విద్యార్థికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో పీజీ సీటు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో బీఎస్సీ ఎమ్ఎస్‌డీఎస్ కోర్సు చదివిన విద్యార్థి వల్ల శ్రీకాంత్ ట్రిపుల్ ఐటీ లక్నోలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ కోర్సులో పీజీ సీటు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ తెలిపారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ జాయింట్ అడ్మిషన్ టెస్ట్–2023 పరీక్షలో జాతీయ స్థాయిలో మెరిట్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది శ్రీకాంత్‌ను శుక్రవారం అభినందించారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసన్న కుమార్, అధ్యాపకులు నరసింహ, దీపిక, దుర్గాప్రసాద్, మల్లేష్, వెంకటరమణ, మధుకర్, సూపరింటెండెంట్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

కేతేపల్లి : ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా జీఎమ్మార్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కేతేపల్లిలో విద్యార్థులకు రోడ్డు భద్రత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫుట్ ఓవర్ వంతెనలను ఉపయోగించుకోవాలని సూచించారు. హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు కె.బుచ్చిరెడ్డి, జీఎమ్మార్ నిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రవితేజ, ఎస్ఎంసీ ప్రతినిధి సతీష్, సందీప్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

నకిరేకల్ : సమాజ సేవలో లయన్స్ క్లబ్ ముందంజలో ఉందని క్లబ్ జిల్లా గవర్నర్ తీగల మోహన్‌రావు అన్నారు. నకిరేకల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి జరిగిన లయన్స్ క్లబ్, సెంటినియల్, నవ్య క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా ఉప్పల వెంకటరమణ, సెంటినియల్ క్లబ్ అధ్యక్షుడిగా వంటిపాక సోమేష్, నవ్య క్లబ్ అధ్యక్షురాలిగా కందాల శోభారెడ్డి తమ కార్యవర్గాలతో ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, కందాల పాపిరెడ్డి, ఎర్ర శంభులింగారెడ్డి, రావిరాల అశోక్, కృపాకర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీకి సన్మానం

నకిరేకల్ : నోముల గ్రామంలో మదర్‌డెయిరీ నూతన కమిటీ చైర్మన్ కందాల చిన్న సుగుణమ్మ, కార్యవర్గాన్ని శుక్రవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య సన్మానించారు. ఈకార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి యాసా కరుణాకర్‌రెడ్డి, నాయకులు సుంకరబోయిన నర్సింహ, పన్నాల రాఘవరెడ్డి, రాచకొండ లింగయ్య, బొప్పని యాదగిరి, బాదిని సోమయ్య, పగిళ్ల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీటి నిల్వలపై చిత్రలేఖనం పోటీలు

రామగిరి(నల్లగొండ) : భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నెహ్రూ యువజన కేంద్ర వారి సౌజన్యంతో జై భీమ్ యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ఎన్జీ కళాశాలలో వర్షపు నీటి నిల్వల ఎలా చేయాలనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యూత్ అధ్యక్షుడు సంజయ్, మారపాక వెంకన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


నార్కట్‌పల్లి : వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నార్కట్‌పల్లి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి ఐదు లక్ష రూపాయలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం నార్కట్‌పల్లి తహసీల్దారు పులి సైదులుకు ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చెరుకు పెద్దులు మాట్లాడుతూ బ్రాహ్మణ వెల్లెంల, ఔరవాణిలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం పూర్తయినా ప్రజలకు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీ యూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న, గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి కొప్పు శ్రవణ్, దండు రవి, అమరగంటి ఐలయ్య, జాల యాదమ్మ, నాగరాజు తదితరులున్నారు.

కేతేపల్లి: అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, ప్రజా సంఘాల ఐక్య వేదిక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కేతేపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జ చినవెంకులు మాట్లాడుతూ పేదలకు ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.5లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, అవ్వారి కిరణ్, సాదయ్య, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


ధనమ్మ

మునుగోడు : కూలి పనులకు వెళ్లిన 30 ఏళ్ల వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన మునుగోడులో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్ఐ సీ.హెచ్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడుకు పట్టణానికి చెందిన ఈరటి ధనమ్మ గత గురువారం కూలి పనులకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం తమ బంధువుల ఇళ్లతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో వెతికినా కన్పించలేదు. దీంతో తల్లి మద్ది అచ్చమ్మ తన కుమార్తె కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ధనమ్మ తన భర్తతో తగువు పడి కొంత కాలంగా తల్లిగారి ఇంటి వద్దనే ఉంటోంది. ఆమెకు ముగ్గురు బాలికలు సంతానం. వారంతా ఐదేళ్ల లోపు వయసు వారే. అచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : మండల కేంద్రానికి గుండెబోయిన రవీందర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఇటీవల మృతిచెందాడు. రేగట్టే గ్రామానికి చెందిన లిఖిత్ ఫౌండేషన్ చైర్మన్ చింతకింది స్వామికుమార్‌గౌడ్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. అభాగ్యురాలిని ఆదుకోరూ అని ఇటీవల సాక్షిలో ప్రచురించగా ఇప్పటికే కొంతమంది దాతలు ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా ఆమెకు సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎటేల్లి క్రాంతి, పల్లెపబోయిన సైదులు, గంట్ల ప్రవీణ్‌రెడ్డి తదితరులున్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

చిట్యాల : సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా భక్త మండలి ప్రతినిధులు చిట్యాలలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి సీహెచ్.నర్సింహారావు, హెచ్ఎం గోలి స్లీవమ్మ, ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, విజయలక్ష్మి, వనజ, ప్రత్యేక ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, ఆవుల గీతా, ఎస్ఎంసీ చైర్మన్ గోలి భాస్కర్, సత్యసాయి భక్త మండలి ప్రతినిధులు జ్యోతి, ఝాన్సీ, రజిని, జయ స్పందన, నాగలక్ష్మీ, సువర్ణ, అంజయ్య పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల కేంద్రంలోని పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో సరస్వతి శిశు మందిర్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు నామని జగన్నాథం నోట్‌బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. పద్మశాలీ యువజన సంఘం అధ్యక్షుడు పున్న కిశోర్, తిరందాసు రాములు, గణేశ్, వెంకటేశం, జగన్, శంకర్, స్వామి, రఘు, అందే రాము, రమేష్, భారత్ నరేష్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

రామగిరి(నల్లగొండ): పోలీసులు మందలించారని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం తిప్పర్తి మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. తనను, తన భార్యను బామ్మర్ది కొత్త సతీష్ మందలించాడని వారం క్రితం తిప్పర్తి గ్రామపంచాయతీకి చెందిన రేఖ ముత్తయ్య పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో సతీష్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి మందలించారు. మనస్థాపానికి గురైన సతీష్ ఇదే విషయాన్ని తన స్నేహితులకు చెప్పి శుక్రవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

వైభవంగా ఆషాఢ మాసం బోనాలు


వేడుకల్లో పాల్గొన్న భక్తులు

నల్లగొండ రూరల్ : పట్టణంలోని మఠ్రిగూడెం బైపాస్‌లో కళ్యాణ కనకదుర్గమ్మ ఆలయ వద్ద శుక్రవారం ఆషాఢ మాసం బోనాల పండుగ వైభవంగా నిర్వహించారు. మఠ్రిగూడెం, ఆర్జాలబావి, చర్లపల్లి గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాల్లో నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో జేరిపోతుల సైదులు గౌడ్, పద్మ, కార్తిక్, మాజీ కౌన్సిలర్ సురిగి మారయ్య, కలగోని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో మీల్స్ ఆన్ వీల్స్


అల్పాహారం పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ 320 ఆధ్వర్యంలో రోగుల సహాయకులకు మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ జిల్లా గవర్నర్ తీగల మోహన్‌రావు మాట్లాడుతూ రోగుల సహాయకులకు 360 రోజులుగా అల్పాహారాన్ని అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గుండా సత్యనారాయణ, జేమ్స్, రామ్మోహన్, సతీష్‌కుమార్, డాక్టర్ ఏసీహెచ్ పుల్లారావు, శివశంకర్, సింహాద్రి, జెల్లా దశరథ, చిలుకూరి రామకృష్ణ, గట్టుపల్లి రవీందర్‌రెడ్డి, మందడి నర్సిరెడ్డి, గట్టుపల్లి అశోక్‌రెడ్డి, ఆదిరెడ్డి, పున్న చండికేశ్వర్, నిమ్మల పిచ్చయ్య తదితరులుల పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

మునుగోడు : మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో నిర్మిస్తున్న ఫార్మా కంపెనీ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం 71వ రోజు కొనసాగింది. దీక్షలో ఆ గ్రామానికి చెందిన జేసీబీ యూనియన్ సభ్యులు కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా వ్యతిరేక కమిటీ కన్వీనర్ భీమనపల్లి సైదులు, గ్రామ అధ్యక్షుడు నందిపాటి వెంకన్న, బాలగోని సత్తయ్య, బొమ్మకంటి రాములు, పరమేష్, జాజుల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

చండూరు : తమకు రావాల్సిన 10 నెలల ఏరియర్స్, రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. మేడే సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన వెయ్యి రూపాయల అదనపు వేతనం అమలు చేయలేదని కార్మికులు పేర్కొన్నారు. నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ కన్వీనర్ మొగుదాల వెంకటేశం, అన్నెపర్తి చిన్న వెంకన్న, కత్తుల సైదులు, నాగరాజు, కృష్ణయ్య, దానయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ మార్చాలని వినతి

చిట్యాల : పట్టణంలోని పదో వార్డులో సర్వే నంబర్ 635లోని వెంచర్‌ను కమర్షియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌లోకి మార్చుతూ మాస్టర్ ప్లాన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బీజేపీ జిల్లా నాయకుడు చికిలంమెట్ల అశోక్ ఆధ్వర్యంలో వెంచర్ వాసులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి వినతి పత్రం అందజేశారు. వెంచర్‌లో మురుగునీటి కాల్వలతోపాటు మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి గంజి గోవర్ధన్, పార్టీ మండల సహ ఇన్‌చార్జ్ జయారపు రామకృష్ణ, కాలనీవాసులు కాచం కృష్ణయ్య, గండమల్ల రాములు, కూనూరు వెంకన్న గౌడ్, గుంటోజు జానాచారి, రాధయ్య, మోహనచారి పాల్గొన్నారు.